రైతులకు సాగు నీటి ఇబ్బందులు రానివ్వం

నందిమేడారం తూము వద్ద విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, అధికారులు

- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్
- నంది రిజర్వాయర్ రెగ్యులేటర్ నుంచి నీటి విడుదల

ధర్మారం,జనవరి19: ధర్మపురి నియోజక వర్గంలోని రైతులకు యాసంగిలో సాగు నీటి ఇబ్బందులు రానివ్వమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హామీ ఇచ్చారు. యాసంగి పంటల సాగుకు నీరందడం లేదని పలు గ్రామాల రైతులు చేసిన వినతి మేరకు శుక్రవారం పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నంది మేడారం గ్రామంలోని నంది రిజర్వాయర్ తూము నుంచి నీటిని లక్ష్మణ్ కుమార్ విడుదల చేశారు. నంది రిజర్వాయర్‌లో నీటి మట్టం తగ్గి పోకుండా ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నుంచి నీటిని పంపింగ్ చేసి నింపాలని నీటి పారుదల శాఖ జగిత్యాల జిల్లా సీఈ సుధాకర్ రెడ్డికి సూచించారు. నంది రిజర్వాయర్ నుంచి నిర్మిస్తున్న నూతన లింక్ కాల్వకు ఎస్సారెస్పీ 5ఆర్ కాల్వకు అనుసంధానం చేసి నీటిని సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రిజర్వాయర్ వద్ద అసంపూర్తిగా ఉన్న గంగాదేవి ఆలయ నిర్మాణానికి తనవంతుగా రూ. 50 వేలు విరాళం అందిస్తానని, ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరు చేయించి పూర్తి చేయిస్తానని గంగపుత్రులకు ఆయన హామీ ఇచ్చారు. అనంతరం ఆయన జడ్పీ పాఠశాలను సందర్శించగా ఉపాధ్యాయులు సన్మానించారు. అక్కడి నుంచి తెనుగువాడకు వెళ్లి పలువురిని పరామర్శించారు. ఎస్సారెస్పీ ఈఈ నూనె శ్రీధర్, సర్పంచ్ సామంతుల జానకి, ఉప సర్పంచ్ కట్ట రమేశ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వయోజనులందరికీ ఓటు హక్కు కల్పించాలి

- కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్

పెద్దపల్లి, జనవరి19: వయోజనులందరికీ ఓటు హక్కు కల్పించాలని కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ సంబంధిత అధికారులకు సూచించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్, ఇతర ముఖ్య ఎన్నికల అధికారులు ఓటరు నమోదు కార్యక్రమం, పార్లమెంట్ ఎన్నికల సన్నద్ధతపై జిల్లా ఎన్నికల అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్ జే అరుణ శ్రీతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఓటరు నమోదు కార్యక్రమం, ప్రత్యేక ఓటరు నమోదు క్యాంపుల ఏర్పాటు, పెండింగ్ ఫారాల పరిష్కారం, పార్లమెంట్ ఎన్నికల సన్నద్ధత తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ కలెక్టర్లకు పలు సూచనలు చేశారు. వీసీ అనంతరం కలెక్టర్ సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. పెండింగ్‌లో ఉన్న ఓటరు దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలన్నారు. ఓటర్ల నమోదుకు 2024 జనవరి ఒకటో తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటరు జాబితాలో చోటు కల్పించేలా కార్యాచరణ అమలు చేయాలని ఆదేశించారు. ముసాయిదా ఓటరు జాబితాపై ప్రజల నుంచి ఈనెల 22 వరకు అభ్యంతరాలు స్వీకరించాలని, ఫిబ్రవరి 2 లోగా అభ్యంతరాలు, ఓటర్ క్లెయిమ్స్‌ను పూర్తి స్థాయిలో పరిష్కరించాలని, అదే నెల 8న తుది ఓటరు జాబితా రూపొందించాలని ఆదేశించారు.

నేడు, రేపు ప్రత్యేక ఓటర్ నమోదు

ఈనెల 20, 21 తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహించే ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో బీఎల్వోలు పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉండి, దరఖాస్తులు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. దీనిపై విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. పార్లమెంట్ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం పోస్టల్ బ్యాలెట్ జారీ చేయనున్నట్లు వివరించారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల జారీ , వాటి నమోదుకు రిసెప్షన్ కేంద్రాల ఏర్పాటు, ఓట్ల లెక్కింపుకు గానూ కౌంటింగ్ కేంద్రం ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో పెద్దపల్లి, మంథని ఆర్డీవోలు సీహెచ్. మధుమోహన్, వీ హనుమా నాయక్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్, షఫీ, ఈశ్వర్, సీనియర్ అసిస్టెంట్ వజహత్ అలీ, ఐటీ సిబ్బంది కిరణ్, వర ప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

మండల సమగ్ర అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే విజయరమణారావు, మండలి విప్ భానుప్రసాదరావు

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మండలి విప్ భానుప్రసాదరావు, ఎమ్మెల్యే విజయ రమణారావు

ఎలిగేడు, జనవరి 19: మండల అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు, ఎమ్మెల్సీ తానిపర్తి భానుప్రసాదరావు అన్నారు. శుక్రవారం మండలంలోని ముప్పిరితోట, లోకపేటలో పలు అభివృద్ధి పనులకు ఇద్దరు కలిసి భూమిపూజ, ప్రారంభోత్సవాలు చేశారు. ముప్పిరితోట లో నూతనంగా నిర్మించిన మహిళా సంఘ భవనాన్ని ప్రారంభించారు. జనరల్ కమ్యూనిటీ భవన నిర్మాణానికి, సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. లోకపేటలో వాల్మీకి బోయ కమ్యూనిటీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సంర్భంగా చేపట్టిన పనులను సకాలంలో పూర్తిచేసి ప్రజల ఉపయోగంలోకి తేవాలని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు సూచించారు. ఆయా గ్రామాల సర్పంచులు పెద్దోల్ల అయిలయ్య, దేవరనేని ప్రభావతి, జడ్పీటీసీ మండిగ రేణుక, ఎంపీపీ తానిపర్తి స్రవంతి పాల్గొన్నారు.

పరామర్శ

కాల్వశ్రీరాంపూర్, జనవరి19: పెగడపల్లికి చెందిన సిరిసేటి రాజెల్లు ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని మండలి విప్ భానుప్రసాద్ రావు, ఎమ్మెల్యే విజయమణారావు, పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. జడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి, మాజీ జడ్పీటీసీ గోపగాని సారయ్యగౌడ్, సర్పంచ్ ఆరెల్లి సుజాత రమేశ్ ఉన్నారు.

జాతీయ బాలికల వారోత్సవాలు

పెద్దపల్లి రూరల్, జనవరి 19: ఈ నెల 19 నుంచి 24 వరకు జాతీయ బాలికల వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సంక్షేమశాఖ అధికారి రవూఫ్ ఖాన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో విద్యా శాఖ సమన్వయంతో జిల్లాలోని బాలికల ఉన్నత పాఠశాలలు, గురుకుల బాలికల విద్యా లయాలు, కేజీబీవీల్లో బాలికలకు వ్యాసరచన, క్రీడా పోటీలు, డ్రాయింగ్, ఉపన్యాస, భేటీ బచావో.. భేటీ పడావో , పేరెంట్స్ మీటింగ్ కార్యక్రమాలు ఉంటాయని వివ రించారు. ఈనెల 24 న జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

నేత్రదానం

ఓదెల, జనవరి 19 : ఓదెల మాజీ ఉప సర్పంచ్ క్యాతం రాజేశం శుక్రవారం మృతి చెందగా, అతని కళ్లను కుటుంబ సభ్యులు దానం చేశారు. సదాశయ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు భీష్మాచారి కళ్లదానంపై గురించి మృతుడి కుటుంబాలకు వివరించారు., ఇందుకు రాజేశం కుటుంబ సభ్యులను అభినందించారు.

విద్యార్థుల సమగ్రాభివృద్ధికి కృషి చేయాలి

మాట్లాడుతున్న కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్

పెద్దపల్లి, జనవరి 19: విద్యార్థుల సమగ్రాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ సూచించారు. జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం తొలిమెట్టు, ఉన్నతి, పదో తరగతి పరీక్షల అంశాలపై ఆదర్శ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో ఎంపిక చేసిన ఐదు ఆదర్శ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి, విద్యార్థులు సమగ్రాభివృద్ధి చెందే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అలాగే అన్ని పాఠశాలల్లో బాలికలకు తప్పనిసరిగా టాయిలెట్లు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. తరగతులకు గైర్హాజరయ్యే విద్యార్థుల ఇళ్లకు ఉపాధ్యాయులు వెళ్లి కారణాలు తెలుసుకోవాలని, పాఠశాలకు పిల్లలను పంపేలా తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. వంద శాతం హాజరు ఉన్నవిద్యార్థులను ప్రోత్సహిస్తూ వారికి బహుమతులు అందజేయాలని సూచించారు. విజ్ఞాన పర్యటనలకు ప్రణాళికలు రూపొందిస్తే దానికి అవసరమైన సంపూర్ణ సహాసహకారాలు అందిస్తామని వెల్లడించారు. వెనకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు ఈనెలాఖరు నాటికి కౌన్సెలింగ్ తరగతులు పూర్తి చేసి, ముఖ్యమైన పాఠ్యాంశాలను రెండు, మూడు సార్లు బోధించాలన్నారు. పదవ తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో డీఈవో డీ మాధవి, ప్రధానోపాధ్యాయులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

విలన్ల పేర్లను తొలగించాలి

ఫర్టిలైజర్‌సిటీ, జనవరి 19: గుంటూరు కారం తెలుగు సినిమాలో విలన్‌లకు పెట్టిన మార్క్స్ లెనిన్ పేర్లను వెంటనే తొలగించాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కొంటు సాగర్ పేర్కొన్నారు. శుక్రవారం నిరసనగా గోదావరిఖని ప్రధానచౌరస్తాలో సినిమా పోస్టర్లను ఆయన నిప్పు పెట్టారు. విప్లవ వీరుల పేర్లను కించపరిచే విధంగా విలన్‌లకు పెట్టడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. వెంటనే తొలగించాలని లేనియేడల సినిమాను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఇక్కడ నాయకులు సురేశ్, హమీద, కల్పన, ప్రవీణ్, సాగర్, కృష్ణ, శివ, సతీశ్, మహేశ్, రజిత, సంధ్య ఉన్నారు.

గ్రూప్స్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లి కమాన్, జనవరి 19 : స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో అందించే ఉచిత గ్రూప్స్ శిక్షణకు ఈనెల 20లోగా దరఖాస్తు చేసుకోవాలని కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్ సంచాలకులు డాక్టర్ రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో గ్రూప్-1, 2, 3, 4 ఫౌండేషన్ కోర్సుకు ఉచిత శిక్షణ ఇస్తున్నామని, ఆసక్తి గల అభ్యర్థులు వైబ్ సైట్ లో నందు ఈ నెల 20వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ కోసం డిగ్రీ అర్హత కలిగిన ఉమ్మడి కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాలకు చెందిన నిరుద్యోగ యువతీ, యువకులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ. 5లక్షలకు మించరాదని, దరఖాస్తుతో పాటు ఎస్ఎస్సీ, ఇంటర్, డిగ్రీ, లేటెస్ట్ కుల, ఆదాయ ధ్రువ పత్రాలు ఆధార్ కార్డు, ఫోటోలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థుల ఎంపిక రిజర్వేషన్, డిగ్రీలో వచ్చిన మార్కుల ఆధారంగా ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 0878-2268686లో, బీసీ స్టడీ సర్కిల్ నూతన భవనం, కరీంనగర్ కార్యాలయం ఆఫీసు వేళల్లో సంప్రదించాలని రవికుమార్ పేర్కొన్నారు.

కల్లు డిపో నిర్వాహకులను అరెస్టు చేయాలి

నిరసన తెలుపుతున్న ఏఐవైఎఫ్ నాయకులు

కోల్‌సిటీ, జనవరి 19: కల్తీ కల్లు విక్రయించి ఇద్దరు యువకుల మృతికి కారణమైన డిపో నిర్వాహకులను అరెస్టు చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మార్కపురి సూర్య డిమాండ్ చేశారు. ఈ మేరకు గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో శుక్రవారం ప్లకార్డులతో నిరసన తెలిపారు. కల్తీ కల్లును నియంత్రించలేని ఎక్సైజ్ సీఐని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కల్లు సొసైటీ సభ్యులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సాదుల శివ, ఆసాల నవీన్, రేణుకుంట్ల ప్రీతం, రాణవేని సుధీర్, గోపికృష్ణ, భూసారపు రాజు, ఎల్కలపల్లి సురేశ్, వినయ్, కరీం గౌస్ తదితరులున్నారు.

బాధితులకు న్యాయం జరగాలి

కల్తీ కల్లు బాధితులకు న్యాయం జరగాలని జడ్పీటీసీ కందుల సంధ్యారాణి డిమాండ్ చేశారు. కల్తీ కల్లు బాధిత కుటుంబాలను ఆమె పరామర్శించారు. సంఘటన జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. బాధితులు విలపిస్తూ గోడు వెల్లబోసుకున్నారు. కల్లు డిపో యజమానులపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేంత వరకు పోరాడుతామని అన్నారు.

ప్రమాదాలు జరుగకుండా అప్రమత్తంగా ఉండాలి

అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

పెద్దపల్లి టౌన్, జనవరి 19: జిల్లా కేంద్రంలోని ఫుడ్ కార్పొరేషన్ గోదాంలో ప్రమాదాలు జరుగకుండా ఉండేందేకు తగిన చర్యలు తీసుకోవడంతోపాటు అప్రమత్తంగా ఉండాలని పెద్దపల్లి ఫైర్ స్టేషన్ అధికారి దేవనంది శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఫుడ్ కార్పొరేషన్ గోదాంలో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు నివారణకు తీసుకొవాల్సిన చర్యలపైన అవగాహన కల్పించారు. దీంతోపాటు గ్యాస్ సిలిండర్ ఫైర్స్, ఎలక్ట్రికల్ ఫైర్స్, అగ్ని ప్రమాదాలు, రోడ్డు, రైలు, వరదలు, భూకంపాలు జరిగినప్పుడు తీసుకునే రక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. ఇక్కడ ఫైర్ అధికారులు మనోహర్, సంతోశ్, శ్రావన్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, ఎఫ్‌సిఐ మేనేజర్ చంద్రమెహన్ పాల్గొన్నారు.

కల్తీకల్లు కేసులో ఒకరి అరెస్ట్

ఫర్టిలైజర్‌సిటీ, జనవరి 19 : కల్తీకల్లు తాగి ఇద్దరు మృతి చెందిన కేసులో నెంబర్‌వన్ కల్లు డిపో డైరెక్టర్ వంగ శ్రీని వాస్‌గౌడ్‌ను గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటనలో మరికొంతమంది డైరెక్టర్లు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కాగా, ఈ కేసు విచారణపై హైదరాబాద్ ఉన్నతస్థాయి పోలీసు అధికారులు ఆరా తీస్తున్నారు.

గురుకులంలో..

జ్యోతినగర్, జనవరి 19: ఎన్టీపీసీలోని సింధూర ఇంజనీరింగ్ కళాశాల భవనంలో నిర్వహిస్తున్న మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలలో 2024-25కు గాను ఐదో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ కే శ్రీధర్ తెలిపారు. ప్రస్తుతం నాలుగో తరగతి చదువుతున్న అర్హులుగా పేర్కొన్నారు. ఐదో తరగతిలో మొత్తం 60 సీట్లు ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. అలాగే ఆరో తరగతిలో 25 సీట్లు, ఏడో తరగతిలో నాలుగు సీట్లు , ఎనిమిదవ తరగతిలో 13 సీట్లు ఖాళీగా ఉన్నట్లు ప్రిన్సిపాల్ వివరించారు.

రేపు సమావేశం

కాల్వశ్రీరాంపూర్, జనవరి19: ఈనెల21న పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని నందన గార్డెన్ లో ఆల్ ఇండియా అంబేద్కర్ యువ జన సంఘం డెలిగేట్స్ సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు లంక సదయ్య శుక్రవారం పత్రికా ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యే లకు, ఎస్సీ, ఎస్టీ కమీషన్ సభ్యులకు సన్మాన కార్యక్రమం ఉంటుందన్నారు. సమావేశానికి జిల్లా సభ్యులు, మండల బాధ్యులు తప్పనిసరిగా హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

అయోధ్య అక్షింతలు వితరణ

ఫర్టిలైజర్‌సిటీ, జనవరి 19: అయోధ్య అక్షింతలు శుక్రవారం గౌతమినగర్‌లో పంపిణీ జరిగింది. ఎఫ్‌సీఐ శివాలయం నుంచి ప్రారంభమైర అక్షింతల పంపిణీ కార్యక్రమాన్ని ఆర్ఎఫ్‌సీఎల్ జీఎం ప్రారంభించగా ఆర్ఎఫ్‌సీఎల్ టౌన్‌షిప్‌లోని ప్రతి క్వార్టర్స్, సమీపం ఏరియాలోని ఇంటింటా అక్షింతలను పంపిణీ చేశారు. ఇక్కడ స్థానిక వెంకటేశ్వర స్వామి దేవాలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు సోమారపు లావణ్య, నరసింహరావు, అర్చకులు పవన్, అజయ్, వెంకటి, శ్యామల, తదితరులు ఉన్నారు.

పరిశుభ్రతపై అవగాహన

సుల్తానాబాద్‌రూరల్, జనవరి 19: కనుకులలో సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సంస్కృతిక సారధి కళాబృందం శుక్రవారం పరిసరాల శుభ్రత, డగ్స్, మాదకద్రవ్యాలతో పాటు తదితర అంశాలపై ప్రజలకు ఆట పాటల ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గుండ్ల స్నేహలత, బుర్ర శంకర్ గౌడ్, దయ సర్సింగ్, ఢిల్లీ వెంకటస్వామి, సరిత, స్పందన, స్వప్న, ఉప్పు స్పందన, గ్రామస్తులు, తదితరులు ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9160900024/9640400073.
NT-319415-All

EDUCATION

★Admissions: రెగ్యులర్ & డిస్టెన్స్: డిగ్రీ, PG, B.Tech, M.Tech, D-Pharma, B.Pharma, B.Sc. (Agri.), B.Sc. (Nursing), B.Ed, B.Ped, MBA, MCA. Eligible for all Jobs. Ph: 8866977112, 339.
NT-319803-All

CHANGE OF NAME

★Gandi Srinu, S/o. Rajalingam H.No. 11-53/3, Rudrangi Village & Mandal, Rajanna Sircilla Dist. T.S changed my Name as Gandi Srinivas S/o Gandi Rajalingam.
NTK-317633

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194

శ్రీశైలం మల్లన్న సన్నిధిలో కొప్పుల

ఈశ్వర్‌కు తీర్థ ప్రసాదాలు అందజేస్తున్న వేదపండితుడు

ధర్మారం,జనవరి19: మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత కొప్పుల ఈశ్వర్ సతీసమేతంగా శుక్రవారం ఏపీలోని శ్రీశైలం మల్లికార్జున స్వామిని దర్శించుకున్నారు. వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయంలో ఈశ్వర్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టు వస్త్రాలు సమర్పించారు.ఈ సందర్భంగా వారికి ఆలయ పండితులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఏరియా వర్క్‌షాపులో ప్రమోషన్లకు ప్రాక్టికల్స్

గోదావరిఖని, జనవరి 19: సింగరేణి ఆర్జీ-1 ఏరియా వర్క్‌షాపులో సూపర్‌వైజర్, టెండాల్, రోఫ్ ప్రెస్సర్, కార్పెంటల్ తదరితర ప్రమోషన్లకు శుక్రవారం ప్రాక్టికల్స్ నిర్వహించారు. కమిటీ అధికారులు ఎస్‌వోటూ జీఎం రామ్మోహన్, ఏజీఎం పర్సనల్ లక్ష్మీనారాయణ, ఇంజినీర్ రామ్మూర్తి పర్యవేక్షించారు. ఎస్ఓటూ జీఎం మాట్లాడుతూ ఈ పరీక్షలను పూర్తి పారదర్శకతతో అధికారుల సమక్షంలో నిర్వహించామని తెలిపారు. 13 మంది ఉద్యోగులు హాజరయ్యారని, వీరికి కమిటీ అధికారుల సమక్షంలో పరీక్షలను నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీజీఎం జితేందర్, డీవైఎస్‌సీ రాజ్‌కుమార్, నరియన్ చక్రవర్తి, అన్వేష్, ఇతర అధికారులు ఉన్నారు.

ఏఐటీయూసీ సమీక్ష

గోదావరిఖని, జనవరి 19: సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో ఏఐటీయూసీ గెలుపుపై శుక్రవారం భాస్కర్ రావు భవన్‌లో జరిగిన యూనియన్ కేంద్ర కార్యవర్గ సమావేశంలో సమీక్షించారు. యూనియన్ అధ్యక్షుడు సీతారామయ్య మాట్లాడుతూ కొత్తగూడెం, ఇల్లందు, మణుగూరు తదితర ప్రాంతాల్లో కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు ఐఎన్టీయూసీ గెలుపు కోసం డబ్బులు, మద్యంతో ప్రలోభాలకు గురి చేసి ఏఐటీయూసీని ఓడించాలని ఎంతో ప్రయత్నించారని అన్నారు. యూనియన్ లోకి పాత నాయకులు తగ్గి కమిటీల్లో కొత్త వారిక అవకాశం కల్పిస్తూ వారిని ప్రోత్సహించాలని అన్నారు. ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్, ఆయా బ్రాంచీల నిర్మాణ పరమైన విషయాలపై మాట్లాడారు. అదనపు ప్రధాన కార్యదర్శి మిర్యాల రంగయ్య, కేంద్ర నాయకులు సారయ్య, ప్రకాశ్, వెంకటస్వామి వీర భద్రయ్య, వైవి రావు, మడ్డి ఎల్లయ్య, మసుకె సమ్మయ్యతోపాటు 11 ఏరియాల బ్రాంచి కార్యదర్శులు మాట్లాడారు

రిపబ్లిక్ డే ఘనంగా నిర్వహించాలి

గోదావరిఖని, జనవరి 19: గణతంత్ర దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించాలని ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్ అన్నారు. జీఎం కార్యాలయంలో అన్ని డిపార్ట్‌మెంట్ల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. స్థానిక జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో ఘనంగా నిర్వహించాలని తెలిపారు.

రాఘవాపూర్ సర్పంచ్ వెంకటేశంపై అనర్హత వేటు

పెద్దపల్లి. జనవరి 19: రాఘవాపూర్ సర్పంచ్ ఆడెపు వెంకటేశం సర్పంచ్ పదవికి అనర్హుడుని జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు డీపీవో చంద్రమౌళి శుక్రవారం ఒక ప్రకటనలోతెలిపారు. రాఘవాపూర్ సర్పంచ్ వెంకటేశంకు ముగ్గురు పిల్లలున్నారని ఆదే గ్రామానికి తాడిశెట్టి శ్రీకాంత్ ఫిర్యాదు చేయగా, పెద్దపల్లి మండల పంచాయతీ అధికారి విచారణ జరిపి, తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం 2018 సెక్షన్ 21 సబ్ సెక్షన్ (3) ప్రకారం ముగ్గురు పిల్లలను కలిగి ఉన్న వెంకటేశం సర్పంచ్ పదవికి అనర్హులుగా పరిగణించనట్లు తెలిపారు. వెంకటేశంను ఇకపై పంచాయతీ సమావేశాలు, ఇతర కార్యక్రమాలకు అనుమతించ వద్దని కార్యదర్శికి సూచించారు. అలాగే తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం 2018 సెక్షన్ 27 (1) ప్రకారం, సెక్షన్ 21 కింద కరీంనగర్ జిల్లా కోర్టులో పిటిషన్ దాఖలు చేయాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు.

అధికారుల సంఘం ఉపాధ్యక్ష పదవికి నామినేషన్

రామగిరి, జనవరి 19: సింగరేణి ఆర్జీ-1, ఏపీఏ అధికారుల సంఘం ఉపాధ్యక్ష పదవికి డిప్యూటీ పర్సనల్ మేనేజర్ గుర్రం శ్రీహరి శుక్రవారం నామినేషన్ వేశారు. సింగరేణిలో అధికారుల సంఘం ఎన్నికల నోటిఫికేషన్ వెలువడగా వారు తమ నామినేషన్ పత్రంను ఆర్జీ-3 జీఎం సుధాకర్ రావుకు అందజేశారు. వారిఓతపాటు ఓసీపీ-1 అధికారి రాధాకృష్ణ, ఫైనాన్స్ ఏజీఎం శ్రీనివాసులు, వెంకటరమణ, చంద్రశేఖర్, పీఎం రవీందర్ రెడ్డి, ఐలయ్య, సునీల్ ప్రసాద్, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

బీమా చెక్కు పంపిణీ

ఫర్టిలైజర్‌సిటీ, జనవరి 19: గోదావరిఖని లక్ష్మీనగర్ బ్రాంచీ కేడీసీసీ బ్యాంకు ఖాతాదారుడు ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా అతనికి సంబంధించిన బీమా చెక్కును శుక్రవారం మేనేజర్ సుద్దాల శ్రీనివాస్ నామినీకి అందజేశారు. ఖాతాదారులు తీసుకునే ప్రధానమంత్రి జీవనజ్యోతి, ప్రధానమంత్రి సురక్షభీమా పథకాలు ఆయా కుటుంబాల భద్రతకు ఎంతో భరోసాగా నిలుస్తున్నట్లు తెలిపారు. ఇక్కడ బ్యాంకు సిబ్బంది ఎఎం కీర్తన, ఎస్ఏ శ్రీనివాస్, శివ, రమాదేవి, రవళి ఉన్నారు.

రథయాత్రను విజయవంతం చేయండి

సుల్తానాబాద్, జనవరి 19 : అయోధ్యలోని రామజన్మభూమిలో ఈనెల 22న సీతారాముల విగ్రహ ప్రతిష్టాపన సందర్భంగా సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని పూసాల భక్తమార్కండేయ దేవాలయంలో జరిగే ప్రత్యేక పూజలతో పాటు, సీతా రాముల రథయాత్రను విజయవంతం చేయాలని దేవాలయ కమిటి చైర్మన్ వల్స నీలయ్య తెలిపారు. భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

29న స్కూల్ మేనేజ్ కమిటీ ఎన్నికలు

పెద్దపల్లి కమాన్, జనవరి 19 : జిల్లాలోని అన్ని పాఠశాలల (ప్రైవేట్ అన్ ఎయిడెడ్ మినహా)కు విద్యాశాఖ ఆదేశాల మేరకు ఈ నెల 29న స్కూల్ మేనేజ్ మెంట్ కమిటీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి డి. మాధవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20న ఎస్ఎంసీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల, అదే రోజు తల్లిదండ్రుల జాబితాను పా